సాక్షి సంగారెడ్డి

సోమవారం । 28 । అక్టోబర్ । 2024



పాత సామాన్ల దుకాణంలో..

గతేడాది పాఠ్య పుస్తకాలను పాత సామాను దుకాణదారులకు కిలోకు రూ.8 చొప్పున హెచ్ఎంలు విక్రయిస్తున్నారు. వివరాలు 8లో ▸



తలిచె తలిచె..

'తలిచె తలిచె కొద్దీ గుర్తొస్తున్నా-కురిసే కురిసే వెన్నెల నువ్వె నాన్న' పాట రాసిన యువకవి మెదక్ జిల్లా నర్సాపూర్ వాసి. వివరాలు 8లో ▸



బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం..

జహీరాబాద్‌లో నిర్మిస్తున్న రైల్వే బ్రిడ్జి పనుల్లో జాప్యం తగదని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం పేర్కొన్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ముర్షత్‌దర్గాలో ఎంపీ సురేశ్ షెట్కార్ ప్రార్థనలు



ముర్షత్‌దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎంపీ సురేశ్ షెట్కార్

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ముర్షత్ దర్గాను జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎన్నికల సమయంలో ఎంపీగా సురేశ్ షెట్కార్ గెలవాలని కాంగ్రెస్ మండల పార్టీ అభిమాని మహబూబ్ అలీ మొక్కుకోగా.. ఇప్పుడు ఎంపీ తోపాటు టీజీఐఐసీ చైర్మన్ తూర్పు నిర్మల దాన్ని తీర్చారు. ఆ మేరకు ఎంపీ, టీజీఐఐసీ చైర్మన్‌లను దర్గా పెద్దలు, అలీ శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ విశ్వనాథం పాల్గొన్నారు.

తెలుగు వారి ప్రాచీన నృత్యం కూచిపూడి

- ఎంపీ రఘునందన్



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్

పటాన్‌చెరు: తెలుగు వారి ప్రాచీన నృత్యం కూచిపూడి అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. కూచిపూడి నృత్య దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున దేవాలయం ఆవరణలో శ్రీ లంబోదర కల్చరల్ అకాడమీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన భవాని కూచిపూడి నార్తనశాలలో మాట్లాడారు. భారతీయ కళలను ప్రోత్సహించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు రాచమల్ల సంతోశ్‌గౌడ్ , నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సీఈఓ సస్పెన్షన్

నారాయణఖేడ్: మండలంలోని సంజీవన్‌రావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సీఈఓ జే మహేశ్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఆ మేరకు ఆదివారం జిల్లా సహకార అధికారి ఆర్.కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ఆడిట్‌లో రూ. 5,94,691 నిధుల దుర్వినియోగం జరిగినట్లు బయటపడిందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డీఏ ప్రకటించకపోవడం బాధాకరం

- ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్



హత్నూర(సంగారెడ్డి): ఉద్యోగులకు 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, మంత్రివర్గం సమావేశంలో ప్రకటన చేయకపోవడంపై అందరూ అసంతృప్తిగా ఉన్నారని ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో 3 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వంలో 2 డీఏలు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. 5 డీఏలను ఇవ్వక పోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళనలో ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే మూడింటినైనా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సీడీసీ చైర్మన్‌గా ముబీన్?

- నేడు అధికారికంగా వెల్లడి

జహీరాబాద్: సీడీసీ చైర్మన్‌గా ముబీన్ నియమితులు కానున్నారు. సోమవారం ఆయన పేరును అధికారికంగా ప్రకటించనున్నారు. మొగుడంపల్లి మండలం అసద్‌గంజ్‌కు చెందిన ఈయన గతంలో సర్పంచ్‌గా పని చేశారు. కాంగ్రెస్ పార్టీ క్రియాశీల రాజకీయాల్లో చురుకుగా పాల్గొనడంతో అధిష్టానం ముబీన్ పేరును ఖరారు చేసినట్లు సమాచారం. నియోజకవర్గంలో మైనార్టీలు అధికంగా ఉన్నారు. దీంతో ఈ పదవి ఆయన్ను వరించనుంది.


నేడు బోరంచకు మంత్రి

నారాయణఖేడ్: మనూరు మండలం బోరంచలోని ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులను మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు రానున్నారని పేర్కొన్నారు. ఆయనతో పాటు ఎంపీ సురేశ్ షెట్కార్ కూడా పాల్గొననున్నట్లు తెలిపారు. పథకం వల్ల బోరంచ వద్ద 1,200 ఎకరాలు, సింధోల్, తాటిపల్లి, లింగంపల్లి గ్రామాలకు చెందిన 1,400 ఎకరాలకు మేలు చేకూరనుందని పేర్కొన్నారు.

ఇక పక్కాగా పశువుల లెక్క

వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు కొనసాగింపు

- విధుల్లో ఎన్యూ మరేటర్లు, సూపర్‌వైజర్లు నిమగ్నం
- ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరణ
- యాప్‌లో నమోదు



సంగారెడ్డి జోన్: జిల్లాలో పశుగణన ప్రారంభమైంది. గ్రామాల్లో ఇంటింటికి తిరిగి పశువుల వివరాలు సేకరిస్తున్నారు. గేదెలు, గొర్రెలు, ఆవులు, మేకలు, కుక్కలు, కోళ్లతో పాటు వివిధ రకాల పశువుల వివరాలను సేకరిస్తున్నారు. ఇటీవల అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి కలెక్టర్ వల్లూరు క్రాంతి.. వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రతీ ఐదు సంవత్సరాలకు ఒకసారి పశుగణన చేపట్టాల్సి ఉండగా ప్రస్తుతం 21వ పశుగణన కొనసాగుతోంది. ఈ సర్వే పక్కాగా చేపట్టాలని జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

- జిల్లాలో ఈనెల 25న ప్రారంభమైన పశుగణన వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతోంది. పశుగణన చేపట్టేందుకు జిల్లా వ్యాప్తంగా 131 మంది ఎన్యుమరేటర్లు, 33 మంది సూపర్‌వైజర్లను నియమించారు. ఇప్పటికే వివరాల సేకరణ, సేకరించిన వివరాలు నమోదు తదితర అంశాలపై సిబ్బందికి సమగ్రంగా శిక్షణ కల్పించినట్లు అధికారులు తెలిపారు. సేకరించిన వివరాలు ప్రత్యేక యాప్‌లో ఆన్ లైన్ ద్వారా నమోదు చేయనున్నారు. గతంలో ఇంటింటికి తిరిగి పశువుల వివరాలు సేకరించి, సంబంధిత కార్యాలయానికి వచ్చి ఆన్‌లైన్లో నమోదు చేసేవారు. ప్రస్తుతం ఆఫ్‌లైన్ కు స్వస్తి చెప్పి ఆన్ లైన్ విధానం అమలు చేయనున్నారు. పనిలో నిమగ్నమైన సిబ్బందికి అదనంగా ఇన్సెంటివ్ అందించనున్నారు.
- జిల్లాలోని పశువుల వివరాలు పకడ్బందీగా సేకరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ ఐదు సంవత్సరాలకు ఒకసారి దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం పశుగణన చేపడుతుంది. 2023లో జీవాలగణన జరగాల్సి ఉండగా ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడినట్లు సమాచారం. పాడి అభివృద్ధి సాధించేందుకు ఈ రంగానికి అందించే ప్రభుత్వ పథకాలు లబ్ధి చేరేందుకే ఈ గణన చేపట్టనున్నారు. పశువులతో పాటు ఎడ్ల బండ్లు, చాపర్ కట్టర్, యజమానుల వివరాలు సైతం సేకరించనున్నారు. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 20 సార్లు పశుగణన జరిగింది. ఈ ప్రక్రియ వల్ల ఏయే పశువులు ఎన్ని ఉన్నాయోనని తెలియడంతో పాటు సీజనల్ వారీగా వ్యాక్సిన్ల పంపిణీకి సైతం ఓ అవగాహన రానుంది. పశు పోషణ అభివృద్ధి చేసేందుకు బడ్జెట్ కేటాయింపుతో పాటు తక్కువ పశువులు ఉన్నచోట పశుసంతతి పెంచేందుకు, రుణాలు కల్పించేందుకు అవకాశం ఉంటుంది.

20వ గణన ప్రకారం జిల్లాలోని పశువుల వివరాలు..

జీవాలు	సంఖ్య
ఆవులు, ఎద్దులు	1,56,282
గేదెలు	1,68,995
గొర్రెలు	4,38,475
మేకలు	2,29,311
పందులు	6,353
కోళ్లు	12,24,576
కుక్కలు	13,486

ప్రణాళికాబద్ధంగా సేకరణ



జిల్లావ్యాప్తంగా 21వ పశుగణన వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతోంది. ఈ గణనలో భాగంగా నియామకం అయిన సిబ్బంది ప్రతీఇంటికి వెళ్లి అన్ని రకాల పశువులతో పాటు యజమాని వివరాలు సేకరించి ఆన్‌లైన్ లో పొందుపరుస్తారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రణాళికాబద్ధంగా పక్కాగా పశుగణన చేపడతారు. తమ వద్ద ఉన్న జీవాల వివరాలు తెలిపి సిబ్బందికి సహకరించాలి.

– డా. ఎం. వసంతకుమారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, సంగారెడ్డి జిల్లా.

'స్థానికం'లో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం

- దీపావళి పండుగ కానుకగా ఇందిరమ్మ ఇళ్లు
- నియోజకవర్గానికి 3,500 గృహాలకు కేబినెట్ ఆమోదం
- మంత్రి దామోదర రాజనర్సింహ



మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

జోగిపేట(అందోల్): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసే అభ్యర్థులను గెలిపించుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ.. నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని అన్నారు. ఆదివారం జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జోగిపేట మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దీపావళి పండుగ కానుకగా ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లను కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఇళ్లు లేని వారికి ప్రభుత్వ స్థలాలను కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగినప్పుడు గాయపడిన వారిని కాపాడుకునేందుకు ప్రతీ 30 కిలోమీటర్ల దూరంలో ట్రామా సెంటర్‌లను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా 76 ట్రామా సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గాయపడిన వారిని కాపాడుకునేందుకు 15 నిమిషాల్లో ఈ కేంద్రాలకు తరలించి చికిత్సలు అందించే అవకాశం ఉంటుందన్నారు.

అందోల్ నియోజకవర్గ వ్యాప్తంగా 38,750 మంది రైతులకు రుణమాఫీ జరిగిందన్నారు. మరో 2 వేల మందికి రూ.425 కోట్లు రుణమాఫీ త్వరలో చేయనున్నట్లు ప్రకటించారు. సింగూరు కాలువకు సిమెంట్ క్రాంకిట్ లైనింగ్ ఏర్పాటుకు రూ.168 కోట్లు మంజూరయ్యాయని త్వరలో పను లు ప్రారంభమవుతాయన్నారు. సింగూరును పర్యా టక రంగంగా తీర్చిదిద్దుతామన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా కుల గణనను ప్రభుత్వం చేపట్టబోతోందన్నారు. ఈ విషయమై మంత్రివర్గ సమావేశంలోను నిర్ణయం తీసుకున్నామన్నారు. తద్వారా అన్ని కులాలకు సముచిత న్యాయం జరుగుతుందన్నారు. జాబ్ క్యాలెండర్ హామీకి కట్టుబడి నోటిఫికేషన్‌లు వేసి ఉద్యోగాలను కల్పిస్తున్నామన్నారు. జోగిపేటను వ్యాపారపరంగా పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అక్షమర్రి నుంచి జోగిపేట వరకు రూ.80 కోట్లతో చేపట్టిన పనులు కొనసాగుతున్నాయన్నారు. అందోల్‌లో 60 సీట్లతో నర్సింగ్ కళాశాలను వచ్చే నెల ప్రారంభించనున్నట్లు తెలిపారు. జోగిపేట వ్యవసాయ మార్కెట్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి దిశగా పాలకవర్గం ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీ సురేశ్ షెట్కార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, వీరశైవలింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు సంగమేశ్వర్, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ డేవిడ్, కౌన్సిలర్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేతన ఒప్పందం చరిత్రాత్మకం

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



మాట్లాడుతున్న చుక్క రాములు

జిన్నారం (పటాన్‌చెరు): వేతన ఒప్పందం చరిత్రాత్మకం అని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. ఆదివారం గుమ్మడిదల మండలం బొంతపల్లి పారిశ్రామిక వాడలోని న్యూ ల్యాండ్ పరిశ్రమలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. న్యూ ల్యాండ్ పరిశ్రమతో చారిత్రాత్మక వేతన ఒప్పందం చేసుకున్నామన్నారు. తక్కువ సమయంలో వేతన ఒప్పందాన్ని పూర్తి చేశామన్నారు. కార్మికులకు 14 వేల రూపాయలతో పాటు అనేక సౌకర్యాలు ఒప్పందంలో అమలవుతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా డీఏ పెంచడం రిటైర్మెంట్ బెనిఫిట్స్ కొత్త కొత్త సౌకర్యాలు కూడా ఉన్నాయన్నారు. సీఐటీయూ ఉన్న చోట అనేక సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్మికులంతా భవిష్యత్‌లోనూ ఐక్యంగా ఉండాలని, అప్పుడే హక్కులను సాధించుకోవచ్చన్నారు. కార్మిక లోకానికి అండగా నిలిచే సంఘం సీఐటీయూయేనని అన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య, జనరల్ సెక్రటరీ వెంకటేశ్, నాయకులు శ్రీధర్, కార్మికులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నర్సారెడ్డి, నాయకులు

తూప్రాన్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ మెట్టు బాలకృష్ణరెడ్డి ఆధ్వర్యంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీతోనే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. గత ప్రభుత్వాలు ప్రభుత్వపరంగా రావాల్సిన సబ్సిడీలను అందించలేదని విమర్శించారు. రైతులకు రూ.2 లక్షలు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతోందన్నారు. రానున్న రోజుల్లో వారికి అనేక సంక్షేమ ఫలాలు అందనున్నాయని తెలిపారు. పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ధాన్యం ఏ గ్రేడ్ రూ.2,320, బీ గ్రేడ్ రూ.2,300, సన్నరకానికి అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తామన్నారు.

మెరుగైన వైద్యం అందుతుందా?

- రోగులను అడిగిన ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారులు బృందం
- నర్సాపూర్ ఆస్పత్రి సందర్శన



ఆస్పత్రిలోని రోగులతో మాట్లాడుతున్న ట్రైనీ అధికారుల బృందం

నర్సాపూర్ రూరల్ : మీకు మెరుగైన వైద్యం అందిస్తున్నారా? సమయానికి మందులు పంపిణీ చేస్తూరా? అని ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారులు నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులను అడిగి తెలుసుకున్నారు. శిక్షణలో భాగంగా రెండో రోజైన ఆదివారం నర్సాపూర్ మున్సిపాలిటీలో వారు పర్యటించారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రితో పాటు అర్బన్ పార్క్‌ను సందర్శించి పరిశీలించారు. ప్రభుత్వాస్పత్రిలో.. రోగులతో మీకు మెరుగైన వైద్యం అందిస్తున్నారా? సమయానికి మందులు పంపిణీ చేస్తున్నారా? అని రోగులను అడిగి తెలుసుకున్నారు. దీంతోపాటు అర్బన్ పార్క్‌లో ఏర్పాటు చేసిన వాచ్ టవర్ పైకెక్కి అటవీ ప్రాంతాన్ని వీక్షించారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వివిధ ఔషధ మొక్కలను, కృత్రిమ జంతువుల విగ్రహాలను, నడక కోసం ఏర్పాటు చేసిన ట్రాక్‌లను పరిశీలించి బాగుందన్నారు. అనంతరం అధికారుల బృందానికి మునిసిపల్ చైర్మన్ దుర్గప్ప గారి అశోక్ గౌడ్ శాలువా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, శానిటైజర్ ఇన్‌స్పెక్టర్ చల్ల మురళి, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ శ్రీకాంత్, సబ్ ఇంజినీర్ భూపాల్, మున్సిపల్ సిబ్బంది వినీత్, రాములు, ఉదయ్, రణదీప్, జవాన్ ఎల్లం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

యువత పొగాకుకు దూరంగా ఉండాలి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే చింతా, అధికారి విష్ణువర్ధన్

సంగారెడ్డి : జిల్లాలోని యువత పొగాకుకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మాతాశిశు సంరక్షణ హాస్పిటల్‌లో పొగాకు నియంత్రణపై చేపట్టిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. యువత ధూమపానం చేయవద్దని అనారోగ్యానికి దారి తీస్తుందన్నారు. క్యాన్సర్‌కు కారకమని, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడతారని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం 60 రోజులపాటు టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 2.0ను ప్రారంభించిందన్నారు. పొగాకు రహిత గ్రామాలను తీర్చిదిద్దడమే ముఖ్య లక్ష్యమన్నారు. ముందుగా కొత్త బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో, మార్కెట్ ఏరియాలో పొగాకు వాడకం ద్వారా కలిగే అనర్థాలను వివరించారు. పలు విద్యాసంస్థలను సందర్శించి విద్యార్థినీ విద్యార్థులకు ఆరోగ్య జాగ్రత్తలను తెలిపారు. తొలుత పొగాకు నియంత్రణ అధికారి విష్ణువర్ధన్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవి, డాక్టర్ శ్రీహరి, వెంకటేశ్వర్లు, శివకుమార్, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది ఇతరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణలేని జీవన విధానంతోనే క్యాన్సర్



జోగిపేటలో నిర్వహిస్తున్న వన్ కే రన్

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మాణయ్య

జోగిపేట(అందోల్): క్రమశిక్షణలేని జీవన విధానం వల్ల క్యాన్సర్ వ్యాధి ప్రబలే అవకాశం ఉందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.మాణయ్య అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాన్సర్ వారోత్సవాల్లో భాగంగా జోగిపేటలో ఆదివారం వన్ కే రన్ నిర్వహించారు. కార్యక్రమానికి ఈ సంఘం నాయకులు సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ చాలా ప్రమాదకరమైందన్నారు. ఈ వ్యాధిని ముందుగానే గుర్తించినట్లయితే కొంతమేరకు ప్రయోజనాలుంటాయన్నారు. ముందుగా ఈ ర్యాలీ ఎన్టీఆర్ స్టేడియం నుంచి అంబేడ్కర్ చౌరస్తా మీదుగా సాగి యథాస్థానానికి చేరుకొని ముగిసింది. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా కార్యదర్శులు డాక్టర్ కె.అనంతరెడ్డి, ఆకుల రాంబాబు, క్లబ్ అధ్యక్షుడు అల్లే శ్రీకాంత్, కోశాధికారి జి.సంతోశ్, మండల విద్యాధికారి బండి కృష్ణ, రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, లెక్చరర్లు ఉపాధ్యాయులు వెంకటేశం, విట్టల్, త్రినాథరావు, నవీన్, కుమారస్వామి, నాగరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయం ఎదుట భక్తుల సందడి

కోరిన కోర్కెలు తీర్చే.. కల్పవల్లి




విశేష అలంకరణలో దుర్గమ్మ

పాపన్నపేట(మెదక్): వన దుర్గమ్మా మా కోరికలు తీర్చు తల్లి అంటూ వేలాది మంది భక్తులు ఆదివారం వేడుకున్నారు. అర్చకులు శంకరశర్మ, పార్థివ శర్మలు తల్లిని అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించి, బోనాలు తీసి, ఒడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. తమ బంధు వర్గాలతో కలిసి భక్తులు విందులు చేసుకొని సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలీసులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకున్నారు.

శనగ సాగుకు అనుకూలం

- కంది తరువాత ఈ పంటకే డిమాండ్
- సుమారు 25 వేల ఎకరాల్లో సాగు



భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్

జహీరాబాద్ టౌన్: శనగ పంట సాగుకు ప్రస్తుతం అనుకూలమైన సమయం. ఇప్పటికే రైతులు పంట సాగుపై దృష్టి పెట్టారు. అవసరమైన విత్తనాలు, ఎరువులను సన్నద్ధం చేసుకుంటున్నారు. 25 వేల ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. జొన్న, వరి, కుసుమ, గోధుమ తదితర పంటలు సాగు చేయడంతోపాటు.. పప్పు దినుసుల్లో కంది తరువాత శనగ పంటనే అధిక విస్తీర్ణంలో వేస్తుంటారు. సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు పాటించాల్సిన పద్ధతులను జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి తెలిపారు. జిల్లాలోని జహీరాబాద్, సంగారెడ్డి, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో శనగ పంట ఎక్కువగా సాగవుతుంది. ముఖ్యంగా నల్లరేగడి భూముల్లో రైతులు పంట సాగు చేస్తుంటారు. అక్టోబర్ నుంచి నవంబరు నెలాఖరు వరకు విత్తుకోవచ్చు. ఒకవేళ ఆలస్యమైతే పూత దశలో అధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు పూత రాలిపోతుంది. మంచు ఆధారంగా పండే పంట, నల్లరేగడి నేలల్లో తేమను ఉపయోగించుకుని మొక్కలు పెరుగుతాయి. పూత, కాత సమయాల్లో సరిపడా నీరు అందించినా సరిపోతుంది. చౌడు నేలలు పనికిరావు. నేలను 2–3 సార్లు దున్నాలి. ఒకసారి నాగలి, రెండు సార్లు గొర్రుతో దున్నాలి. ముందుగా విత్తనాన్ని శుద్ధి చేసుకోవాలి. దీంతో తెగుళ్లను ముందుగానే నివారించవచ్చు. ఎకరానికి 30–40 కిలోల విత్తనాలు అవసరం. పశువుల ఎరువుతోపాటు ఎకరానికి 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 18 కిలోల గంధకం ఎరువులను చివరి దుక్కిలో వేసుకోవాలి. విత్తే ముందు భూమిలో సరిపడా తేమ ఉండేటట్లు చూసుకోవాలి.

విత్తన రకాలు

కేఏకే 2, జేజీ 11, శ్వేత 2, జ్యోతి తదితర రకాలు మేలైనవి. స్వల్పకాలిక పంట అయినందున విత్తన రకాలన్ని బట్టి 85–100 రోజుల్లో పంట చేతికొస్తుంది. ఎకరాకు 6–12 టన్నుల దిగుబడి వస్తుంది. విత్తిన 30 రోజుల వరకు కలుపు లేకుండా చేసుకోవాలి. విత్తిన 30 నుంచి 35 రోజుల దశలో గొర్రుతో అంతర కృషి చేసి కలుపు నివారించుకోవచ్చు. పంటకు పచ్చ, రబ్బరు పురుగు బెడద అధికంగా ఉంటుంది. ఎండు.. వేరు తెగుళ్లు కూడా సోకుతుంది. వాటి నివారణకు అందుబాటులో ఉన్న వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని ఏడీఏ భిక్షపతి తెలిపారు.



శనగ పంట(ఫైల్)

క్లుప్తంగా

గురుకుల విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కౌడిపల్లి(నర్సాపూర్): గురుకుల విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండల కేంద్రమైన కౌడిపల్లిలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో చోటు చేసుకుంది. ఆదివారం ప్రిన్సిపాల్ ఫణికుమార్, ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిమ్మాపూర్ కుషన్ గడ్డ తండాకు చెందిన బిక్య కుమారుడు వరుణ్‌తేజ్ 8వ తరగతి చదువుతున్నాడు. శనివారం రాత్రి ఉపాధ్యాయుడు రమేశ్ స్టడీ అవర్ నిర్వహిస్తున్నాడు. ఈ సమయంలో విద్యార్థి ఎలుకల మందు వాటర్ బాటిల్‌లో కలుపుకొని తాగుతుండగా తోటి విద్యార్థులు గమనించి ఉపాధ్యాయుడికి చెప్పారు. వెంటనే చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి విద్యార్థి తండ్రికి సమాచారం ఇచ్చారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పారు. ప్రస్తుతం గురుకుల పాఠశాలలో సమ్మెటివ్ వన్ పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షలు సరిగ్గా రాయలేదని తండ్రి తిడతాడేమో అన్న భయంతో ఎలుకల మందు తాగానని వరుణ్ తేజ్ విద్యార్థులకు చెప్పినట్లు సమాచారం. ఈ విషయంపై కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆరాతీశారు.

కల్వర్టు నుంచి కిందపడి..

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మల్లేశ్(ఫైల్)

వర్గల్(గజ్వేల్): రోడ్డు కల్వర్టు పై కూర్చొని కింద పడటంతో తీవ్ర గాయాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన వర్గల్ మండలం వేలూరు శివారులో జరిగింది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. సీతారాంపల్లికి చెందిన తుపాకుల మల్లేశ్(35)కు భార్య లలిత, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. వ్యవసాయంతోపాటు కూలీ పని చేస్తుంటాడు. శుక్రవారం ఉదయం కూలీ పని నిమిత్తం వేలూరు గ్రామం వైపు వెళ్తూ ఎల్లమ్మగుడి సమీప కల్వర్టుపై కూర్చుని ప్రమాదవశాత్తు వెనక్కి పడిపోయాడు. దీంతో తీవ్రగాయాలై అపస్మారక స్థితికి వెళ్లాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య లలిత ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాత సామాన్ల దుకాణంలో పాఠ్య పుస్తకాలు

- పాఠశాలలో స్టాక్ పేరుకుపోతుందని విక్రయం
- విద్యా సంవత్సరం చివర్లో విద్యార్థుల నుంచి సేకరణ
- డబ్బులు పాఠశాల ఆదాయంలో జమకాని వైనం
- జిల్లాలో పంపిణీ చేసిన పుస్తకాలు 6,61,355
- తయారీకి రూ.4 కోట్ల వ్యయం
- నాణ్యతతో తయారు చేస్తే మరింత మన్నిక

స్కూళ్లు ప్రారంభంకాగానే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నూతన పాఠ్య పుస్తకాలు అందజేస్తారు. కొన్ని పాఠశాలల్లో కొత్త పుస్తకాలు అందక.. అవి వచ్చే వరకు పాత పుస్తకాలనే ఇస్తారు. కానీ ఇక్కడ మాత్రం పాఠ్య పుస్తకాలు పాత సామాన్ల దుకాణంలోకి వెళ్తున్నాయి. విద్యా సంవత్సరం ఆఖరి రోజు విద్యార్థుల నుంచి పాఠశాల సిబ్బంది పుస్తకాలను తీసుకోగా, పాఠశాలలో స్టాక్ పేరుకుపోవడంతో పాత సామాన్ల వారికి అమ్మేస్తున్నారు. ఆ డబ్బులు పాఠశాల ఆదాయంలో జమ చేయాల్సి ఉంటుంది. కానీ వాటికి లెక్కలు కనిపించడం లేదు. రూ.కోట్లు వెచ్చించి ముద్రిస్తున్న పాఠ్య పుస్తకాల కాలపరిమితి ఏడాదికే ముగుస్తుంది.

– పాపన్నపేట(మెదక్)


పాపన్నపేటలోని పాత సామాన్ల దుకాణంలో పాఠ్య పుస్తకాలు

మెదక్ జిల్లాలో సుమారు 966 ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు ఉండగా, 46,266 బాలురు, 48,515 మంది బాలికలు కలిపి మొత్తం 94,781 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి 6,61,355 పాఠ్య పుస్తకాలు, 1,13,620 నోట్ బుక్కులు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. వీటికి సుమారు రూ.4 కోట్ల వ్యయం అవుతుందని తెలుస్తుంది. కాగా ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రం పాఠ్యపుస్తకాలను డబ్బులు పెట్టి కొనాల్సి వస్తుంది. అయితే పాఠ్య పుస్తకాలను నాణ్యమైన అట్టలతో తయారు చేస్తే రెండు మూడేళ్ల మన్నిక ఉండే అవకాశం ఉందని, తద్వారా ప్రతీయేటా రూ.కోట్లను పొదుపు చేయొచ్చని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

పాత సామాన్ల దుకాణాల్లో దర్శనం

విద్యా సంవత్సరం చివరి రోజున విద్యార్థుల నుంచి ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలు సేకరిస్తారు. మరుసటి విద్యాసంవత్సం మొదటి రోజున ఏవైన పాఠ్య పుస్తకాలు తక్కువగా వస్తే పాత పుస్తకాలను సర్దుబాటు చేస్తారు. తిరిగి కొత్త పుస్తకాలు రాగానే మళ్లీ తీసుకుంటారు. అనంతరం పాఠశాలలో పేరుకుపోయిన గతేడాది పాఠ్య పుస్తకాలను పాత సామా ను దుకాణదారులకు కిలోకు రూ.8 చొప్పున హెచ్‌ఎంలు విక్రయిస్తారు. వారు హైద్రాబాద్ వ్యాపారులకు కిలోకు రూ.12 వరకు అమ్ముతుంటారు. అయితే ఈ డబ్బులను ప్రధానోపాధ్యాయులు పాఠశాల ఆదాయంలో జమ చేయాల్సి ఉంటుంది,కానీ వాటికి లెక్కలేవి ఉండవన్న ఆరోపణలున్నాయి.

2001నుంచి ఉచిత పాఠ్యపుస్తకాలు



నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఉచిత విద్య అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం 2001 నుంచి ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తుంది. 2021 నుంచి సింగిల్ రూల్, డబుల్ రూల్ నోట్ బుక్కులు కూడా పంపిణీ చేస్తుంది. యూ డైస్‌లో ఉన్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రతీయేటా విద్యాసంవత్సరం ఆరంభం నాటికి పాఠ్యపుస్తకాలు పాఠశాలలను చేరేలా చర్యలు తీసుకుంటున్నారు. మెదక్‌లో ఉన్న పాఠ్యపుస్తక డిపో ద్వారా, మండల వనరుల కేంద్రానికి చేరుకుంటాయి. అక్కడి నుంచి పాఠశాలలకు సంబంధిత ప్రధానోపాధ్యాయులు తీసుకెళ్లి విద్యార్థులకు పంపిణీ చేస్తారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, జిల్లా కేంద్రంలో ప్రభుత్వం గుర్తించిన డీలర్ ద్వారా పాఠ్య పుస్తకాలు కొంటారు.

రూ.కోట్ల ఖర్చు తగ్గుతుంది



పాఠ్య పుస్తకాలను మన్నిక గల మందమైన అట్టలతో క్వాలిటీ పేపర్ వాడీ తయారు చేస్తే కనీసం రెండు నుంచి మూడేళ్ల మన్నిక ఉండే ఆస్కారం ఉంది. లైబ్రరీలో ఉండే పుస్తకాలు ఏళ్ల తరబడి ఉంటున్నాయి. తద్వారా ప్రభుత్వానికి యేటా రూ.కోట్ల ఖర్చు తగ్గుతుంది.

– శివ్వ రమేశ్ బాబు, డైట్ ప్రిన్సిపాల్, మెదక్

అట్టలు వేయడం నేర్పాలి



మా చిన్నపుడు. సెకండ్ హ్యాండ్ పుస్తకాలు సగం ధరకు కొనుక్కొని చదువుకునేవాళ్లం. అందుకే విద్యార్థులకు కొత్త పాఠ్య పుస్తకాలు ఇవ్వగానే క్లాస్ టీచర్లు శ్రద్ధ తీసుకొని పుస్తకాలకు అట్టలు వేసే అలవాటు నేర్పాలి. దాని ద్వారా పుస్తకాలు మన్నికగా ఉండటంతో వచ్చే యేడు విద్యార్థులకు ఉపయోగపడుతాయి.

– అంజాగౌడ్, టీచర్, పాపన్నపేట

నాణ్యతతో తయారు చేయాలి



కొత్త టెక్నాలజీతో పాఠ్య పుస్తకాలను తయారు చేయాలి. పాలిథిన్ కవర్ వచ్చేలా చూడాలి.పేపర్, ప్రింటింగ్, కలర్ తదితర మెటీరియల్ నాణ్యమైంది.. మన్నిక గలది అయ్యేలా ఉండాలి. దీంతో పాఠ్యపుస్తకాలు ఎక్కువ కాలం మన్నిక కలిగి ఉంటాయి. వాటిని రెండు మూడేళ్ల వరకు వాడుకోవచ్చు. రూ.కోట్లలో ఖర్చు ఆదా అవుతుంది.

– రాధాకిషన్, డీఈఓ మెదక్

నిలకడగా విద్యార్థినుల ఆరోగ్యం

పర్యవేక్షిస్తున్న జిల్లా అధికారులు


విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని కేజీబీవీలో అస్వస్థతకు గురైన విద్యార్థినులు కోలుకుంటున్నారు. ఇద్దరు మినహా మిగితా వారందరి ఆరోగ్యం నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. అస్వస్థతకు గురైన 16 మందిలో 10 విద్యార్థినులను మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి పంపిన విషయం తెలిసిందే. జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, డీఎం అండ్‌హెచ్‌ఓ గాయత్రీదేవి, జీసీడీఓ దగ్గరుండి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు పూల్ సింగ్ నాయక్, తదితరులు పరామర్శించారు. అస్వస్థతకు గురైన విద్యార్థులు కోలుకుంటున్నారని, కానీ కొందరు సోషల్ మీడియాల్లో తప్పుడు సమాచారాన్ని పోస్టు చేస్తున్నారని వాటిని ఎవరూ నమ్మొద్దని డీఎంహెచ్‌ఓ కోరారు.

అతివేగంతో వాహనం బోల్తా

- 18 మందికి గాయాలు, ముగ్గురి పరిస్థితి విషమం
- నిజాంపేట మండలం బాచేపల్లి వద్ద ఘటన


ప్రమాద స్థలంలో బోల్తా పడిన వాహనం

కల్హేర్(నారాయణఖేడ్): తుఫాన్ వాహనం బోల్తా పడటంతో 18 మందికి గాయాలు అయ్యాయి. ఇందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం బాచేపల్లి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మహారాష్ట్ర దెగ్లూర్ నుంచి ఓ తుఫాన్ వాహనం హైదరాబాద్‌కు 20 మంది ప్రయాణికులతో వస్తుంది. సంగారెడ్డి–నాందేడ్ 161 జాతీయ రహదారిపై డ్రైవర్ అతివేంగా నడుపుకుంటూ వస్తూ నిజాంపేట మండలం బాచేపల్లి వద్దకు రాగానే బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నారాయణఖేడ్ జుక్కల్ శివారులోని జ్యోతిబాపూలే పాఠశాల ప్రిన్సిపాల్ ఇంద్రవత్ శ్రీనివాస్‌కి తీవ్ర గాయాలు అయ్యాయి. అనంతరం తుఫాన్ రోడ్డు పక్కన పల్టీ కొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 18 మందికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించగా, ఇందులో ముగ్గురు దీపాలి, విలాస్, లక్ష్మీబాయి పరిస్థితి విషమంగా ఉండటంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. కల్హేర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు చెబుతున్నారు.

ఆటో బోల్తా : ఐదుగురు కూలీలకు గాయాలు

కొముురవెల్లి(సిద్దిపేట): అదుపుతప్పి ఆటో బోల్తా పడటంతో ఐదురుగురికి గాయాలు అయ్యాయి. బాధితుల కథనం మేరకు.. చేర్యాల మండలం వేచరేణి గ్రామానికి చెందిన మాదాసు ఎల్లవ్వ, పోశవ్వ, అండవ్వ, లక్ష్మి, రాణి, శాంతమ్మ, లక్ష్మి, తాడూరి రేణుక, మాదాసు ప్రేమలత తదితరులు ఆదివారం కొమరవెల్లి మండలం లెనిన్ నగర్ గ్రామంలో వ్యవసాయ కూలీ పనులకు వెళ్లారు. పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి వెళ్లేందుకు అందరూ ఆటోలో కూర్చున్నారు. డ్రైవర్ ఆటో గేర్‌లో ఉన్న విషయాన్ని గుర్తించకుండా వెనుక తాడు లాగాడు. ఆటో స్టార్ట్ అయ్యి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మాదాసు పోశవ్వ, ఎల్లవ్వ, రాణి, అండాలు, లక్ష్మికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చేర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్, కారు ఢీ

చేర్యాల(సిద్దిపేట): ట్రాక్టర్, కారు ఢీకొని ముగ్గురికి గాయాలైన ఘటన మండల పరిధిలోని ముస్త్యాల శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. జనగామకు చెందిన గుండా శ్రీకాంత్, స్వప్న, సహర్ష్ కారులో సిద్దిపేటకు వెళ్తున్నారు. ముస్త్యాల శివారులోకి రాగానే ట్రాక్టర్ ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

పత్తి చేనులో గంజాయి సాగు

- ఇద్దరు రైతుల నుంచి 36 మొక్కలు స్వాధీనం
- మండల కేంద్రంలో ఎక్సైజ్ అధికారుల వరుస దాడులు


గంజాయి మొక్కలను చూపుతున్న జోగిపేట ఎక్సైజ్ అధికారులు

వట్‌పల్లి(అందోల్): మండలంలో రెండు రోజులుగా ఎక్సైజ్ అధికారులు వరుస దాడులు చేస్తున్న నేపథ్యంలో అక్రమ గంజాయి సాగు గుట్టరట్టవుతోంది. ఆదివారం నిర్జప్ల గ్రామంలో జోగిపేట ఎక్సైజ్ సీఐ సాగర్‌రెడ్డి, ఎస్‌ఐ విజయ్‌కుమార్, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన కుమ్మరి చంద్రయ్య ఇంటి వద్ద 8, అతడి పత్తి చేనులో 20 గంజాయి మొక్కలను గుర్తించారు. అదే గ్రామానికి చెందిన పెద్దగొల్ల మొగులయ్య పత్తి పంట చేనులో 8 గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.4 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఒకే రోజు ఒకే గ్రామంలో ఇద్దరి రైతుల వద్ద అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలను ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి పట్టుకోవడంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. శనివారం ఉసిరికపల్లి గ్రామంలో మన్నె విఠల్ పత్తి పంటలో అంతర పంటగా సాగు చేసిన 17 గంజాయి మొక్కలు, 16 కిలోల ఎండు గంజాయి దొరికిన విషయం తెలిసిందే. ఈ దాడుల్లో సిబ్బంది సాయిలు విక్రమ్, ముఖీమ్, వెంకటేష్ చౌదరి, పంచాయతీ సెక్రటరీలు జయంతి, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

వైన్స్ షాపులో భారీ అగ్ని ప్రమాదం

- రూ.30 లక్షల లిక్కర్ కాలి బూడిద


పూర్తిగా కాలిపోయిన లిక్కర్, ఫర్నిచర్

జహీరాబాద్ టౌన్: మద్యం దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న ఘటన మొగుడంపల్లి మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బస్టాండ్ రోడ్డులో ఉన్న రేణుక ఎల్లమ్మ మద్యం దుకాణం షెట్టర్ నుంచి ఉదయం 9 గంటల ప్రాంతంలో పొగలు వస్తున్న విషయాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే వైన్స్ నిర్వాహకులకు చెప్పారు.షెట్టర్ తాళాలు తీయడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. వెంటనే జహీరాబాద్ అగ్నిమాపక సిబ్బంది, ఎక్సైజ్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలార్పేశారు. అప్పటికే మద్యం బాటిళ్లతోపాటు ఫర్నిచర్ పూర్తిగా కాలి బూడిదయ్యాయి. రిఫ్రిజిరేటర్‌లో షార్ట్ సర్క్యూట్ తలెత్తడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని తెలిసింది. సుమారు రూ. 30 లక్షల నష్టం వాటిల్లినట్లు దుకాణం నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు నమోదు చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం..

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ అనురాధ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంక్ ఖాతా వివరాలు గానీ, ఖాతాకు లింక్ ఉన్న సిమ్ కార్డును గానీ ఇవ్వకూడదని సూచించారు. ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూం 8712667100కు సమాచారం అందించాలని సూచించారు.

ఉద్యోగులను మభ్యపెడుతున్న ప్రభుత్వం

- హామీలను నెరవేర్చకపోవడం దారుణం
- తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనాకర్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గానికి ఇచ్చిన హామీలను రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సాకుతో కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకపోవడం దారుణమని తపస్ రాష్ట్ర కార్యదర్శి పబ్బతి శ్రీనాకర్ రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనాకర్ రెడ్డి మాట్లాడుతూ.. హామీలు నెరవేర్చాల్సిన సమయంలో, సాకులతో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గానికి మొండి చేయి చూపడం సరికాదన్నారు. కొంతకాలంగా జేఏసీల ఆధ్వర్యంలో ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రాలు ఇస్తున్నప్పటికీ, రెండేళ్ల కిందట ఇవ్వాల్సిన రెండు కరువు భత్యాల్లో ఒకటి మాత్రమే ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం సమస్యలను దాటవేస్తున్నప్పుడు మాత్రమే ఉప సంఘాలను నియమిస్తుందని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ఉప సంఘం నియమించి సమస్యలను దాటవేయాలని ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 317జీవో బాధితుల సమస్యల పరిష్కారాన్ని చేపట్టాలని, లేకుంటే ఉద్యమ బాటే శరణ్యమన్నారు. ఇందులో భాగంగా 28న మండల తహసీల్దార్‌లకు వినతిపత్రాన్ని అందిస్తామని, ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళీధర్, కార్యదర్శి పరశురాములు, దేవదాసు, బుచ్చిరెడ్డి, జైపాల్ యాదవ్, వెంకటరామిరెడ్డి, విద్యాసాగర్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యం

- డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి
- ఎస్టీటీయూ కార్యాలయం ప్రారంభం


ఎస్టీటీయూ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నర్సారెడ్డి, తదితరులు

గజ్వేల్ : విద్యారంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్‌లో సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్(ఎస్టీటీయూ) కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఉపాధ్యాయులు సైతం ప్రభుత్వ ఆశయాల కనుగుణంగా పని చేయాలని పిలుపునిచ్చారు. వారి సమస్యల పరిష్కారానికి తమవంతు సహకారాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, కాంగ్రెస్ నాయకులు రామచంద్రాచారి, ఎస్టీటీయూ రాష్ట్ర నాయకులు మల్లికార్జున్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పనికని వెళ్లి.. చెరువులో శవమై తేలి

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

కౌడిపల్లి(నర్సాపూర్): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని వెంకట్రావ్ పేట గ్రామంలో చోటు చేసుకుంది. ఆదివారం ఎస్‌ఐ రంజిత్ రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఉప్పరి నరేశ్ (27) శనివారం పనికి వెళ్తున్నానని భార్యకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఆమె గ్రామంలోనే తల్లిగారింటికి వెళ్లింది. ఉదయం భర్త ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు వెతికారు. స్థానిక పెద్ద చెరువు వైపు వెళ్లినట్లు తెలియడంతో అనుమానంతో చెరువులో వెతకగా నరేశ్ మృతదేహం లభ్యమైంది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజా ఉద్యమాలకు అండగా సీపీఎం

పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్కా రాములు

గజ్వేల్: ప్రజా ఉద్యమాలకు సీపీఎం దన్నుగా నిలుస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్కా రాములు అన్నారు. ఆదివారం సాయిరామ్ ఫంక్షన్ హాలులో సీపీఎం ఆహ్వాన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 1, 2 తేదీల్లో గజ్వేల్ పట్టణంలో సీపీఎం సిద్దిపేట జిల్లాస్థాయి మూడో మహా సభలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందెబోయిన ఎల్లయ్య, గోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

తలిచె తలిచె.. పాట రాసింది మనోడే

పాటల రచయితగా రాణిస్తున్న నర్సాపూర్ వాసి శ్రీకృష్ణ


గాయని సునీతతో శ్రీకృష్ణ గ్రిల్లర్

నర్సాపూర్: 'ఏందిరా ఈ పంచాయితి' సినిమాలో హిట్ కొట్టిన 'తలిచె తలిచె కొద్దీ గుర్తొస్తున్నా–కురిసే కురిసే వెన్నెల నువ్వె నాన్న' పాట రాసిన యువకవి మెదక్ జిల్లా నర్సాపూర్ వాసి. నర్సాపూర్‌కు చెందిన రమావత్ శ్రీకృష్ణ పేదరికంలో పెరిగి ప్రైవేటు దుకాణాల్లో పని చేస్తూ డిగ్రీ పట్టా పుచ్చుకొని కంప్యూటర్ కోర్సులు చదివినా అనంతరం కుటుంబ పోషణ చేపడుతూనే తనలో ఉన్న పాటలు, కథలు రాయాలన్న కవిత్వానికి జీవం పోశాడు.. ఇంకా పోస్తూనే ఉన్నాడు.

స్వతహాగా పాటలు రాయాలన్న తపన..

పాటలు, కథలు రాయాలన్న ఆసక్తితో ఇండస్ట్రీలోకి వెళ్లిన శ్రీకృష్ణ ఇప్పటి వరకు తెలుగులో 20 పాటలు, హిందీలో 10 పాటల వరకు రాశాడు. సుమారు రెండేళ్ల కిందట 'సినిమా సోకులు' పేరిట ఓ పాటతో ప్రైవేటు ఆల్బం తయారు చేశాడు. ఈ ఆల్బంలో శ్రీకృష్ణ రాసిన అరరే మామ పట్నం పోదామా పాటను సింగర్ పెద్దపల్లి రోహిత్ పాడారు. నర్సాపూర్ రత్నాలు, మిర్జాపూర్ ఫాంహౌజ్ తదితర పలు షార్ట్ ఫిలిమ్స్ చేసినా ఆర్థిక ఇబ్బందులతో వాటిని ప్రమోట్ చేయలేకపోతున్నాడు. కంప్యూటర్ కోర్సులు చదివే సమయంలో ఎడిటింగ్, డీటీపీ సైతం నేర్చుకోవడంతో పలు సోషల్ మీడియాకు వీడియోలు తయారు చేయడం, ఇతరత్రా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇండస్ట్రీలో అతన్ని శ్రీకృష్ణ గ్రిల్లర్‌గా పిలుస్తారు.


కుటుంబ సభ్యులతో..

కుటుంబ నేపథ్యం

నర్సాపూర్ మండలంలోని తుల్జారాంపేట తండాకు చెందిన రమావత్ మంగు, జీరిభాయి దంపతులు సుమారు 40 ఏళ్ల కిందట నర్సాపూర్‌కు వచ్చి పట్టణంలోని జగన్నాథరావు కాలనీలో స్థిర పడ్డారు. వారి సంతానం రమావత్ శ్రీకృష్ణ. శ్రీకృష్ణకు 14 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు తండ్రి చనిపోయాడు. దీంతో కుటుంబం గడవడక పదవ తరగతి ఫెయిల్ కాగానే పట్టణంలోని పలు దుకాణాల్లో పని చేస్తూ కుటుంబపోషణలో తల్లికి అండగా నిలిచాడు. ఓపెన్ యూనివర్శిటీలో చేరి డిగ్రీ పూర్తి చేయడంతోపాటు కంప్యూటర్ కోర్సులు పూర్తి చేశాడు. తల్లి జీరిభాయి, భార్య మనస్విని, ఇద్దరు కూతుర్లు హయాతి, హైందవిశ్రీలతో కలిసి నర్సాపూర్‌లో నివాస ముంటున్నాడు.

పాత కక్షలతో యువకులపై దాడి

ఎనిమిది మంది అరెస్ట్


చికిత్స పొందుతున్న సతీష్

మద్దూరు(హుస్నాబాద్): పాత కక్షలతో ఇద్దరి యువకులపై పలువురు దాడి చేసిన ఘటన మద్దూరు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మద్దూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన చిలుక సతీష్, చిలుక లచ్చయ్య కుటుంబాల మధ్య ఇటీవల గొడవ జరిగింది. శనివారం రాత్రి 9గంటలకు చిలుక సతీష్ తన స్నేహితుడు దామెర విజయ్‌ను బైక్ పై ఎక్కించుకొని మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఇదే సమయంలో పాత కక్షను మనస్సులో పెట్టుకున్న చిలుక లచ్చయ్య పలువురు వ్యక్తులు రాజు, రాంబాబు, పరుశరాములు, బాబు, మురళీ, ప్రేమకుమార్‌తో కలిసి గ్రామంలోని చర్చి సమీపంలో సతీష్ బైక్‌ను అడ్డగించాడు. అందరూ ఒక్కసారిగా ఇనుప రాడ్లు, కర్రలతో సతీశ్, విజయ్‌లను విచక్షణరహితంగా కొట్టారు. తీవ్ర గాయాలైన ఇద్దరిని కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు సతీష్ తండ్రి చిలుక దశరథం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిని అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపారు. ఎస్సీకాలనీలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో హుస్నాబాద్ ఏసీపీ సతీష్ ఆధ్వర్యంలో చేర్యాల సీఐ శ్రీను, హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, చేర్యాల ఎస్సై నీరేశ్, కొమురవెల్లి ఎస్సై రాజు, అక్కన్నపేట ఎస్సై విజయ్ భాస్కర్, స్పెషల్ పార్టీ పోలీసులు పికెటింగ్ నిర్వహించారు.